సాక్షి
ఖమ్మం
ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



పిల్లల భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్‌పై తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. 8లో



సత్వర న్యాయం.. సాయం

కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంతో పాటు వరద బాధితులకు చేయూతనిస్తున్నామని జిల్లా జడ్జి రాజగోపాల్ తెలిపారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

పంట నష్టం ఎకరాల్లో.. 27,908

- ఇటీవల వరదలతో దెబ్బతిన్న పంటలపై సర్వే పూర్తి
- జిల్లాలో 27,219 మంది రైతులు నష్టపోయినట్లు గుర్తింపు
- ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన వ్యవసాయ శాఖ
- కూసుమంచి, మధిర డివిజన్లలో ఎక్కువ ప్రభావం



వరి పంట కోల్పోయి దెబ్బతిన్న పొలాన్ని సరిచేసుకుంటున్న కట్టుకాచారానికి చెందిన రైతు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: ఈనెల మొదట్లో భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో సంభవించిన పంట నష్టాల లెక్కలు తేలాయి. ఈనెల 1వ తేదీ నుంచి రెండు రోజులు జిల్లాలో ఈదురుగాలులతో కూడిన అతి భారీ వర్షాలు కురవగా వరదతో పంటలకు అపార నష్టం వాటిల్లింది. మున్నేరు, ఆకేరు, బుగ్గవాగు తదితర వాగుల వెంట ఉన్న పంటలు ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయాయి. జిల్లా చరిత్రలో ఈ వరదలు రికార్డు కాగా, పంట నష్టాన్ని వ్యవసాయ, ఉద్యాన శాఖలు గుర్తించాయి. వర్షాలు, వరదలతో జిల్లాలో 33 శాతం దెబ్బతిన్న పంటలను మాత్రం నమోదు చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

అన్ని పంటలకూ ముప్పు

భారీ వర్షాలు, వరదలతో జిల్లాలో 27,219 మంది రైతులకు చెందిన 27,908.28 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయ శాఖ గుర్తించింది. వరి, పత్తి, పెసర, మొక్కజొన్న, మిర్చి, అరటి, బొప్పాయి తదితర పంటలకు నష్టం వాటిల్లినట్లు నివేదికలో పేర్కొన్నారు. వర్షాలు కురిసిన సమయాన అధికారులు ప్రాథమికంగా 46,374 మంది రైతులకు చెందిన 68,345 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. ఆతర్వాత ప్రభుత్వ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి నష్టాన్ని నమోదు చేశారు.

మండలాల వారీగా జరిగిన పంట నష్టం వివరాలు

మండలం	రైతులు	పంటనష్టం (ఎకరాల్లో)	మండలం	రైతులు	పంటనష్టం (ఎకరాల్లో)
			రఘునాథపాలెం	681	614.14
			కొణిజర్ల	496	531.19
ఖమ్మం రూరల్	2,821	4,128.37	వైరా	480	428.33
ముదిగొండ	3,139	3,843.30	కామేపల్లి	468	332.37
కూసుమంచి	3,185	3,262.24	సింగరేణి	107	112.22
ఎర్రుపాలెం	3,249	3,228.13	వేంసూరు	58	83.38
మధిర	4,094	2,902.16	తల్లాడ	27	53.03
నేలకొండపల్లి	2,172	2,457.29	కల్లూరు	39	50.08
తిరుమలాయపాలెం	2,426	2,397.23	పెనుబల్లి	61	45.23
చింతకాని	1,667	1,481.01	ఏన్కూరు	07	12.07
బోనకల్	1,546	1,308.35	సత్తుపల్లి	10	10.26
ఖమ్మం అర్బన్	486	621.30	మొత్తం	27,219	27,908.28

కూసుమంచి, మధిర డివిజన్లలో ఎక్కువ

కూసుమంచి, మధిర వ్యవసాయ డివిజన్లపై వర్షాలు, వరదల ప్రభావం ఎక్కువగా పడింది. ఆ తర్వాత ఖమ్మం డివిజన్‌లో సైతం నష్టం ఎదురైంది. కూసుమంచి డివిజన్‌లోని ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాలు, మధిర డివిజన్‌లోని ముదిగొండ, ఎర్రుపాలెం, మధిర, చింతకాని, బోనకల్ మండలాల్లో పంటలకు అధిక నష్టం జరిగింది. ఖమ్మం డివిజన్‌లోని ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లగా.. వైరా, సత్తుపల్లి వ్యవసాయ డివిజన్లలో కూడా నష్టం కనిపించింది.



గణేశ్వరంలో దెబ్బతిన్న పత్తి మొక్కలు చూపిస్తున్న రైతు (ఫైల్)

ప్రభుత్వానికి నివేదన

పంట నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేసిన ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు నివేదికలను ప్రభుత్వానికి నివేదించారు. కలెక్టర్ ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పంపించారు. ప్రస్తుతం మండలాల వారీగా పంట నష్టాల విస్తీర్ణం, రైతుల సంఖ్య వివరాల నివేదికలను అందించామని, ఒకటి, రెండు రోజుల్లో పంటల వారీగా కూడా నివేదికలు సిద్ధం చేస్తామని డీఏఓ తెలిపారు.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం స్వామి మూలవిరాట్‌తో పాటు స్వామి వారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. అంతేకాకుండా పల్లకీ సేవ చేయగా, రెండు తెలుగు రాష్ట్రాలకు భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల అవార్డులకు దరఖాస్తులు

ఖమ్మంవన్‌టౌన్: విశిష్ట సేవలందిస్తున్న వయోవృద్ధులు, సంస్థలకు అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందిస్తామని జిల్లా సంక్షేమాధికారి కె.రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు www.wdsc.telangana.gov.in వెబ్‌సైట్ నుండి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం పూర్తి వివరాలతో హైదరాబాద్ మలక్‌పేటలోని రాష్ట్ర కార్యాలయానికి ఈనెల 25వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా అందేలా పంపించాలని సూచించారు.

జిల్లాలో 512 డెంగీ కేసులు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఓ వెంకటరమణ

ఏన్కూరు: ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 512 డెంగీ కేసులు నమోదయ్యాయని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఆయన శనివారం ఏన్కూరులో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించాక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం డీఎంఓ మాట్లాడుతూ జిల్లాలో చికెన్‌గున్యా, మలేరియా కేసులు లేవని, డెంగీ కేసులే నమోదవుతున్నాయని తెలిపారు. ఈక్రమంలో దోమల నియంత్రణ చర్యలు తీసుకుంటూనే డెంగీ బారిన పడిన వ్యక్తి ఇంటికి 100మీటర్ల దూరం వరకు అందరికీ రక్తపరీక్షలు చేయిస్తున్నట్లు వెల్లడించారు. కాగా, ప్రజలు కూడా ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట్రావు, వైద్యులు బి.రాములు, మౌనిక, ఉద్యోగులు శివరాజు, రమణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ)ల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను శనివారం పరిశీలించారు. గతేడాది జూలైలో నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్టీ, సీఆర్టీ, నర్సింగ్, పీఈటీలుగా అవకాశం కల్పిస్తున్నారు. ఈమేరకు మూడో విడతగా 92 మందిని అర్హులుగా గుర్తించి సమాచారం ఇవ్వగా శనివారం సర్టిఫికెట్ల పరిశీలనకు 63మంది హాజరయ్యారని జీసీడీఓ(గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) మోత్కూరి తులసి తెలిపారు.

నాగన్నకు 'సుద్దాల' పురస్కారం



నాగన్న దంపతులను సన్మానిస్తున్న అశోక్‌తేజ

ఖమ్మంగాంధీచౌక్: ప్రజాకవి, గాయకుడు జిల్లాకు చెందిన అరుణోదయ నాగన్న సుద్దాల హనుమంతు, జానకమ్మ స్మారక జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా శనివారం ఖమ్మం వచ్చిన సినీకవి, సుద్దాల ఫౌండేషన్ చైర్మన్ సుద్దాల అశోక్‌తేజ అరుణోదయ నాగన్నను కలిసి పురస్కారం వివరాలు వెల్లడించారు. యాభై ఏళ్లుగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తరఫున కలం, గళం ద్వారా ప్రజాచైతన్యానికి కృషి చేస్తుండడంపై పురస్కారానికి ఎంపిక చేసినట్లు వివరించారు. వచ్చేనెల 19న హైదరాబాద్‌లో పురస్కార ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. ప్రజాకవి యోచన, భూపతి, వెంకటేశ్వర్లు, స్వర్ణ భాస్కర్, విప్లవ్ పాల్గొన్నారు.

టీచర్లు, తల్లిదండ్రుల సమన్వయమే కీలకం



తల్లిదండ్రుల సూచనలు వింటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- తద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య, ఉజ్వల భవిష్యత్
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రఘునాథపాలెం: విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తూ విద్యార్థుల ప్రగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటే పిల్లలకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన బోధన చేస్తూ మంచి భవిష్యత్ అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరాయంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై సమావేశాలకు హాజరై పిల్లల ప్రగతిని ఆరా తీస్తూ ఇంటి వద్ద కూడా చదివించాలని సూచించారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాలల్లో టాయిలెట్లు, తరగతి గదులను పరిశీలించి సూచనలు చేస్తే సరిచేస్తామని తెలిపారు. కాగా, ప్రతిరోజు పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆంగ్ల బోధన, క్రీడా తరగతులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. అనంతరం కలెక్టర్ పాఠశాలలోని టాయిలెట్లు, వంట గది, ఆర్‌ఓ ప్లాంట్, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి ఆర్‌ఓ మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ, గ్రామ కార్యదర్శి కృష్ణ, మాజీ ఎంపీటీసీ యరగర్ల హన్మంతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని ప్రగతిపై ఆరా తీస్తున్న కలెక్టర్

ఒక్కో సమావేశానికి రూ.వెయ్యి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని వివరించేలా ప్రతీనెల మూడో శనివారం తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల సమావేశాలు(పీటీఎం) నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నిర్ణయించారు. ఈక్రమంలో శనివారం జిల్లాలోని 1,155 పాఠశాలల్లో పీటీఎంలు నిర్వహించగా తల్లిదండ్రులకు టీ, స్నాక్స్ సమకూర్చినందుకు ఒక్కో పాఠశాలకు రూ.వెయ్యి ఇవ్వాలని కలెక్టర్ నిర్ణయించారని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు.

అభ్యంతరాల స్వీకరణకు ముగిసిన గడువు

- 28న గ్రామపంచాయతీ ఓటర్ల తుది జాబితా
- ఆ తర్వాత మార్పులు, చేర్పులకు అవకాశం

ఖమ్మంవన్‌టౌన్: ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న గ్రామపంచాయతీలకు సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈనేపథ్యాన పనులను ముమ్మరం చేసి కొద్దిరోజుల క్రితం జీపీలు, వార్డుల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేశారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఎంపీడీఓకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, శనివారం నాటికి అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 900 అభ్యంతరాలు అందాయి. వీటిని పరిశీలించి ఎన్నికల నియమావళి ప్రకారం అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

214 పెండింగ్

ఈనెల 28న జిల్లా పంచాయతీ అధికారులు ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నారు. శనివారం అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసే సమయానికి జిల్లా వ్యాప్తంగా 900 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇప్పటికే దులో 686 దరఖాస్తులను పరిష్కరించగా, 214 పెండింగ్ ఉన్నాయని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత తెలిపారు. వీటిని కూడా 26వ తేదీలోగా పరిష్కరించి తుది జాబితా సిద్ధం చేస్తామని వెల్లడించారు. కాగా, ఓటర్ల తుది జాబితా విడుదల చేశాక జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

గ్రామపంచాయతీల్లో ఆడిట్!

- ఆదాయం, నిధుల వ్యయంపై పరిశీలన
- 21మంది ఆడిటర్ల కేటాయింపు



నేలకొండపల్లి: గ్రామపంచాయతీల్లో నిధుల వ్యయంపై ఆడిటింగ్ మొదలుకానుంది. 2023–24 ఆర్థిక సంవత్సరం ఆదాయ, వ్యయాలపై లెక్కలు తేల్చడంతో పాటు బిల్లులు, ఓచర్లు సరిగ్గా ఉన్నాయో, లేదో పరిశీలించేందుకు జిల్లాలోని 589 గ్రామపంచాయతీల్లో ఆడిట్ నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. ఈ ప్రక్రియను డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

అటు నిధులు, ఇటు పన్నులు

పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ పథకాల ద్వారా నిధులు మంజూరవుతుంటాయి. ఇవి కాకుండా ప్రజలు కూడా పన్నులు చెల్లిస్తారు. ఈ నిధులను పాలకవర్గాలు సక్రమంగా ఖర్చు చేశారా, లేదా ఆడిట్ శాఖ చూస్తుంది. ఏటా నిర్వహించే ఆడిట్ కోసం ఈసారి షెడ్యూల్ ఖరారు చేశారు. జిల్లాలోని ఏ జీపీలో ఏ రోజు ఆడిట్ జరుగుతుందో షెడ్యూల్ రూపొందించి పంచాయతీలకు వివరాలు పంపించారు. ఈ మేరకు ఆయా పంచాయతీ కార్యదర్శి ఆడిటర్ వచ్చేలోగా రికార్డులు, బిల్లులను పరిశీలన కోసం సిద్ధం చేసి ఉంచాలి. ఒకవేళ ఏదైనా కారణాలతో కార్యదర్శి లేదా ఆడిటర్ హాజరు కాలేని పరిస్థితి ఉంటే మరో తేదీ కేటాయిస్తారు. ప్రస్తుతం జిల్లాలో 21 మంది ఆడిటర్లను కేటాయించగా, వరదలతో ఇప్పటికే ఆలస్యమైనందున త్వరగా మొదలుపెట్టాలని ఆదేశించారు.

పొరపాట్లకు తావు లేకుండా..

గతంలో మాన్యువల్‌గా జరిగే ఆడిట్‌ను మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. పంచాయతీల్లో రికార్డుల పరిశీలన పూర్తికాగానే అదే రోజు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. తద్వారా సవరణలకు కానీ మార్పులు, చేర్పులకు కానీ అవకాశం ఉండదు. చిన్న పంచాయతీల్లో ఒకే రోజు ఆడిట్ పూర్తికానుండగా, మేజర్ పంచాయతీలు, మండల కేంద్రాలలో మాత్రం నాలుగైదు రోజుల పాటు ప్రక్రియ కొనసాగే అవకాశముంది.

దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

ముదిగొండ: రైతులు ధరణి సైట్‌కు సంబంధించి ఇచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. ముదిగొండ తహసీల్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ధరణి దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం, ఇంటింటి ఓటరు జాబితా సర్వేపై తహసీల్దార్ సునీత ఎలిజబెత్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులకు సూచనలు చేశారు.

ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

కూసుమంచి: సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన ప్రజల ఆరోగ్యంపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కూసుమంచిలోని పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆయన ఓపీ, మందుల లభ్యతపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతూ మెరుగైన సేవలందించాలని తెలిపారు.



ముదిగొండ : రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

పదేళ్ల కల.. ఫలిస్తున్న వేళ

- రేమిడిచర్లలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అడుగులు
- 53 ఎకరాల భూమి టీఐసీసీకి బదలాయింపు
- త్వరలోనే అనుమతులు, పనుల ఆరంభం



ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు రేమిడిచర్లలో కేటాయించిన భూమి



డ్రోన్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు పరిశీలించిన ఏవియేషన్ అధికారులు (ఫైల్)

ఎర్రుపాలెం: మండల వాసుల దశాబ్దాల నాటి కల ఫలించే సమయం ఆసన్నమవుతోంది. ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఇప్పటికే గుర్తించిన 53.20 ఎకరాల భూమిని రెవెన్యూ శాఖ నుండి టీఐసీసీకి బదలాయిస్తూ ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది. త్వరలోనే మిగతా అనుమతులు కూడా జారీ కానున్నట్లు తెలుస్తుండగా, ఆ వెంటనే ఇండస్ట్రియల్ పార్క్ పనులు మొదలుకానున్నాయి. తద్వారా ఉపాధి కోసం ఎదురుచూస్తున్న యువతలో ఆశలు ఫలించి.. దూరప్రాంతాలకు వెళ్లే ఇక్కట్లు తీరతాయి.

ఉపాధి అవకాశాలు లేక...

మధిర నియోజకవర్గంలో పరిశ్రమలు లేక యువతకు ఉపాధి లభించడం లేదు. దీంతో ఏపీలోని విజయవాడ, కొండపల్లి పట్టణాల్లో పలువురు భవన నిర్మాణ కూలీలుగా వెళ్తున్నారు. అలాగే, అదే రాష్ట్రం వీరులపాడు మండలం నర్సింహాపురంలోని బ్యాటరీలు, రేకులతయారీ పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. ఇంటర్, డిగ్రీ చదివిన వారే కాక నిరుద్యోగులు కూడా ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడే..

ఇక్కడ నిరుద్యోగుల సమస్యలను ఏళ్ల క్రితమే గమనించిన మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడు ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు కోసం దాదాపు 60 ఎకరాల భూమి కేటాయించారు. ఆతర్వాత ప్రభుత్వం మారడంతో పురోగతి కానరాలేదు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. భట్టికి కీలకమైన డిప్యూటీ సీఎం పదవి దక్కడంతో ఇండస్ట్రియల్ పార్క్‌పై దృష్టి సారించారు. ప్రస్తుతం భూబదలాయింపు జరగడంతో త్వరలోనే ప్రకటన వస్తుందని.. ఆపై పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు పడనున్నాయి. కాగా, పదేళ్ల క్రితం భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నెరవేరుతుండడంతో ఈ ప్రాంత ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు కేటాయించిన స్థలం డ్రోన్ల పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అనుకూలంగా ఉందా, లేదా అని జూలై 12న ఏవియేషన్ అధికారుల బృందం, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించిన విషయం విదితమే.

స్థానికంగా ఉపాధి అవకాశాలు



ఇక్కడ యువత ఏపీ రాష్ట్రంలో భవన నిర్మాణాల కూలీలుగా వెళ్తున్నారు. పలువురికి ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు ఉన్నప్పటికీ ఉపాధి సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృషితో రేమిడిచర్లలో పరిశ్రమలు ఏర్పాటైతే స్థానికంగానే ఉపాధి లభించనుంది.

– వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాజులదేవరపాడు

ఇబ్బందులు పడుతున్నాం..



స్థానికంగా ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నాం. పీజీ చదువుకున్నప్పటికీ ప్రైవేట్ ఉద్యోగాలు కూడా దొరకడం లేదు. ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటైతే మాకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం పార్క్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టడం సంతోషంగా ఉంది.

– గుడేటి బాబురావు, ఎర్రుపాలెం

భూమి సర్వే, టీజీఐసీసీకి అప్పగింత



రేమిడిచర్లలోని సర్వే నంబర్ 372లో 53.18 ఎకరాల భూమి సర్వే పూర్తయింది. ఈ భూమిని టీజీఐసీసీకి అప్పగించాం. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత అభివృద్ధితో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది.

– ఎం.ఉషాశారద, తహసీల్దార్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

పిల్లల భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టి

- తల్లిదండ్రులు కూడా సహకరిస్తే మంచి ఫలితాలు
- పేరెంట్స్ – టీచర్ల సమావేశాల్లో అదనపు కలెక్టర్ శ్రీజ


విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఎర్రుపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లల చదువు, ప్రగతిపై తల్లిదండ్రులు కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. విద్యార్థులు వెనకబడినట్లు గుర్తించినా, వసతుల్లో లోపాలు తెలిసినా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఎర్రుపాలెం మండలంలోని భీమవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హరిజనవాడ ప్రాథమిక పాఠశాలల్లో శనివారం నిర్వహించిన పేరెంట్స్ – టీచర్స్ సమావేశ(పీటీఎం)ల్లో ఆమె పాల్గొన్నారు. భీమవరం హైస్కూల్‌లో 150 మంది తల్లిదండ్రులకు గాను ఏడుగురే హాజరవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలు ఎలా చదువుతున్నారు, వారికి వసతులు అందుతున్నాయా, లేదా అని తల్లిదండ్రులు కూడా తెలుసుకోవాలన్నారు. వచ్చే సమావేశానికి అందరూ హాజరయ్యేలా చూడాలని ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులకు సూచించారు. ఆతర్వాత అంగన్‌వాడీ కేంద్రం, ఎర్రుపాలెంలో అద్దె గదుల్లో కొనసాగుతున్న ప్రభుత్వ డెయిరీ, ఇందిరమ్మ డెయిరీ భవన నిర్మాణ స్థలాన్ని ఆమె పరిశీలించారు. కాగా, భీమవరం హరిజనవాడ పేరును విద్యానగర్‌గా మార్చాలని కోట కృష్ణయ్య తదితరులు అదనపు కలెక్టర్‌కు విన్నవించారు. డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఎంపీడీఓ సురేందర్, ఈజీఎస్ ఏపీడీ శ్రీనివాసరావు, ఎంపీఓ శ్రీలక్ష్మి, డెయిరీ ఏపీఎం జె.లక్ష్మణరావు, ఏపీఎం కె.వెంకటేశ్వర్లు, ఏపీఓ కె.నాగరాజు, ఇందిరా డెయిరీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కె.అన్నపూర్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ


కుటుంబ సర్వే వివరాలు పరిశీలిస్తున్న డీఏఓ

కామేపల్లి: అర్హత కలిగిన రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల లోపు రుణం మాఫీ చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తెలిపారు. మండలంలోని జాస్తిపల్లి పరిధిలో పత్తి, వరి పంటలను శనివారం పరిశీలించిన ఆయన సస్యరక్షణ చర్యలపై సూచనలు చేశారు. ఆతర్వాత పొన్నేకల్ రైతు వేదికలో రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, ఏఓ తారాదేవి, ఏఈఓలు ఉష, వేదిత, రవికుమార్ పాల్గొన్నారు.

'జమిలి ఎన్నికలు బీజేపీ కుట్రలో భాగమే'



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరావు

ఖమ్మం మామిళ్లగూడెం: జమిలి ఎన్నికలు నిర్వహించాలనేది బీజేపీ కుట్రలో భాగమేనని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు విమర్శించారు. ఖమ్మంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగం, పేదరికం, అధిక ధరలు వంటి సమస్యలను కేంద్రం పక్కన పెట్టిందని ఆరోపించారు. ఇదికాక లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరపాలని చేస్తున్న ఆలోచన ప్రమాదకరమని పేర్కొన్నారు. ఈమేరకు ఆలోచనను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసందర్భంగా బోడేపూడి విజ్ఞాన కేంద్రం శాఖ కార్యదర్శిగా ఎస్.కే.అఫ్జల్‌మియాను ఎన్నుకోగా నాయకులు సుబ్బారావు, వీరబాబు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'చేతన' బృందానికి మంత్రి అభినందనలు


మంత్రి సీతక్కతో చేతన ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: ఇటీవల ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో వరద బాధితులకు చేతన ఫౌండేషన్ ద్వారా అందించిన సేవలు అభినందనీయమని రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క కొనియాడారు. చేతన ఫౌండేషన్ చైర్మన్ వెనిగళ్ల రవికుమార్ – రేణుక దంపతుల ఆధ్వర్యాన సభ్యులు శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆమె వరదల సమయాన బాధితులకు చేసిన సేవలను అభినందించి, భవిష్యత్‌లోనూ సేవలందించాలని సూచించారు. వలంటీర్లు ముత్తినేని సురేశ్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్, సత్తులాల్ పాల్గొన్నారు.

కృష్ణకుమారికి డాక్టరేట్


కృష్ణకుమారి

సత్తుపల్లి: సత్తుపల్లి గాంధీనగర్‌కు చెందిన తన్నీరు కృష్ణకుమారి డాక్టరేట్ అందుకున్నారు. ఎన్ఐఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సిల్వియా ఫెర్నాండెజ్ పర్యవేక్షణలో ఆమె 'ఇంపాక్ట్ ఆఫ్ పర్సనాలిటీ ఆన్ అకడమిక్ స్ట్రెస్ అండ్ సెల్ఫ్ ఎఫీకసి ఎమాంగ్ కాలేజ్ స్టూడెంట్స్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక పత్రానికి గాను ఉస్మానియా యూనివర్సిటీ సైకాలజీ విభాగం నుంచి డాక్టరేట్ ప్రకటించారు. కాగా, కృష్ణకుమారికి 2014లో కేయూలో ఎమ్మెస్సీ సైకాలజీ పూర్తిచేయగా బంగారు పతకం సాధించారు. డాక్టరేట్ సాధించేలా ప్రోత్సహించిన తల్లిదండ్రులు తన్నీరు వెంకటయ్య, వీరమ్మలకు, భర్త డాక్టర్ నర్సింహారావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సైనికుడి మృతదేహం వైద్య కళాశాలకు...


శ్రీనివాసరావు మృతదేహాన్ని కాలేజీలో అప్పగిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 31వ డివిజన్‌కు చెందిన మాజీ సైనికుడు ఏపూరి శ్రీనివాసరావు (81) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన 2013లోనే భార్యాపిల్లల సమక్షాన తాను కన్నుమూశాక మృతదేహాన్ని మమత మెడికల్ కళాశాలలో విద్యార్థులకు బోధన కోసం అప్పగించాలని వీలునామా రాశారు. ఈ నేపథ్యాన శనివారం ఆయన మృతదేహాన్ని అన్నం సేవా ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావుతో కుటుంబీకులు మమత మెడికల్ కాలేజీకి అప్పగించారు. బీఆర్ఎస్ నాయకుడు గుండాల కృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు ఎర్ర శ్రీకాంత్, ఎర్ర గోపి, ఎర్ర శ్రీనివాసరావు, బందారు యాకయ్య, భుక్యా శ్రీనుతో పాటు శ్రీనివాసరావు సోదరుడు ఏపూరి హరినాథ్‌బాబు, ఆర్యవైశ్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దంశెట్టి శ్రీకాంత్, బీజేపీ నాయకుడు కొంకిమళ్ల మృత్యుంజయరావు తదితరులు నివాళులర్పించారు.

రేపు అండర్-19 క్రికెట్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: అండర్–19 విభాగంలో జిల్లాస్థాయి బాలుర క్రికెట్ జట్టు ఎంపికకు సోమవారం పోటీలు నిర్వహిస్తున్నామని క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు సీహెచ్.వెంకట్, ఎండీ.ముసుద్‌పాషా తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఉదయం పది గంటలకు మొదలయ్యే పోటీలకు హాజరయ్యే క్రికెటర్లు వయసు ధ్రువీకరణపత్రాలతో పాటు గడిచిన మూడేళ్ల ప్రోగ్రెస్ రిపోర్టు, ఇంటర్ మెమోతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 98486 62125 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. కాగా, ఇక్కడ ఎంపిక చేసే జట్టు 26వ తేదీన వరంగల్‌లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగే టోర్నీలో పాల్గొంటుందని వెల్లడించారు.

నిలిచిన ట్యాంకర్.. ట్రాఫిక్‌కు అంతరాయం



రైల్వేగేట్ వద్ద నిలిచిన యాష్ ట్యాంకర్

కారేపల్లి: కారేపల్లి మండలం గాంధీపురం రైల్వే గేట్ వద్ద ఇల్లెందు నుండి ఖమ్మం వైపు వెళ్తున్న యాష్ ట్యాంకర్ లారీ కమాన్ కట్టలు విరిగి నిలిచిపోయింది. దీంతో శనివారం రెండు వైపులా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ మేరకు ఆర్‌టీసీ బస్సులు మినహా మిగతా వాహనాలను కారేపల్లి క్రాస్ నుండి వయా కారేపల్లి మీదుగా దారి మళ్లించారు. లారీ మరమ్మతు పూర్తయ్యాక పంపించడంతో మళ్లీ రాకపోకలు మొదలయ్యాయి.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,392

భాషపై పట్టు సాధించేలా బోధన


వైరారూరల్ : విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

వైరారూరల్/చింతకాని/బోనకల్: విద్యార్థులు తెలుగు, ఆంగ్లం భాషలపై పట్టు సాధించేలా బోధన చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ సూచించారు. వైరా మండలంలోని రెబ్బవరం, చింతకాని మండలం ప్రొద్దుటూరు, బోనకల్ మండలం రావినూతల, జానకీపురం,బోనకల్ ఉన్నత పాఠశాలల్లో శనివారం జరిగిన ఉపాధ్యాయులు – తల్లిదండ్రుల సమావేశాలకు హాజరయ్యారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడతూ విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం చదవడం, రాయడం, గణితంలోని ప్రాథమిక భావనలను బోధించడంపైఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని సూచించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు ఆంగ్లంలోనే మాట్లాడాలని.. తద్వారా విద్యార్థులకు ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. అంతేకాక విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈసమావేశాల్లో ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి దామాల పుల్లయ్య, హెచ్‌ఎంలు వెంకట్రావు, దేవరకొండ సైదులు, ఉపాధ్యాయులు దొడ్డ వరప్రసాద్, కిరణ్‌కుమార్, లలిత, శ్రీనివాసరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలకు నిరసనగా రేపు బ్లాక్ డే

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కిసాన్ సంయుక్త మోర్చా పిలుపులో భాగంగా ఈనెల 23న సోమవారం దేశవ్యాప్తంగా నిర్వహించే బ్లాక్ డేను జయప్రదం చేయాలని కార్మిక, రైతు సంఘాల అఖిలపక్షం నాయకులు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో శనివారం జరిగిన సమావేశానికి ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.డీ.వై.పాషా అధ్యక్షత వహించగా పలువురు మాట్లాడారు. రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలతో పాటు కార్మికులకు సంబంధించి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు తమ ఉద్యమం ఆగదని తెలిపారు. ఈమేరకు జిల్లా కేంద్రాల్లో నల్ల జెండాలతో నిరసన తెలుపుతూ బ్లాక్ డేగా పాటిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, గాదే లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, జి.రామయ్య, వెంకటరెడ్డి, శ్రీనివాస్, దొండపాటి రమేష్, మక్కా శేఖర్ గౌడ్, రావి శివరామకృష్ణ, పేరబోయిన మోహన్‌రావు, పాల్వంచ కృష్ణ, షేక్ అఫ్జల్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం.. ఆపన్నులకు సాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్


మహిళకు చక్రాల కుర్చీ, సరుకులు అందిస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మంలీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే కాక ప్రకృతి విపత్తు బాధితులకు సాయం కూడా అందిస్తామని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ తెలిపారు. న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యాన 200 మంది వరద బాధితులకు నిత్యావసర సామగ్రి, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ బాధితుల కోసం కొంత సరుకు పంపించగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన సేకరించిన సామగ్రి కలిపి రూ.1,700 విలువైన సామగ్రిని 200మందికి అందించామని తెలిపారు. ఇందుకు సహకరించిన బార్ అసోసియేషన్‌తో పాటు దాతలను అభినందించారు. న్యాయమూర్తులు కె.ఉమాదేవి, వి.అపర్ణ, డి.రాంప్రసాదరావు, ఎం.అర్చనాకుమారి, కే.వీ.చంద్రశేఖరరావు, ఎం.కల్పన, కె.దీప, వి.మాధవి, ఆర్.శాంతిలత, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాసరావు చింతనిపు వెంకట్, ఖమ్మం ఆర్‌డీఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బొక్కలగడ్డకు చెందిన ముగ్గురు దివ్యాంగులు వరదలతో చక్రాల కుర్చీలను కోల్పోగా వారికి డీడబ్ల్యూఓ ద్వారా చక్రాల కుర్చీలతో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు.

అశాస్త్రీయమైన సర్దుబాటు సరికాదు..

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల సర్దుబాటుపై అశాస్త్రీయంగా జీఓ విడుదల చేయడం సరికాదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 11 మంది విద్యార్థులకు ఇద్దరు, 60 మంది విద్యార్థులకు సైతం ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయించాలని పేర్కొనడం గర్హనీయమని తెలిపారు. ఈ జీఓను వెనక్కి తీసుకుని ప్రతీ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు, 60 మంది విద్యార్థులకు వరకు ముగ్గురు, ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా కేటాయించాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు ఉత్తర్వులు ఇవ్వడాన్ని పరిశీలిస్తే ఇప్పట్లో డీఎస్సీ నియామకాలు చేపట్టే అవకాశం లేనట్లు తెలుస్తోందని చెప్పారు. కాగా, బదిలీ అయిన ఎస్‌జీటీలందరినీ వెంటనే రిలీవ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఎస్ఈ కార్యాలయం పైనుంచి దూకేస్తాం..

సబ్‌స్టేషన్‌కు స్థలం ఇచ్చిన నరసింహారావు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో పదేళ్ల క్రితం సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆకుల నరసింహారావు 12 కుంటల భూమి ఇచ్చాడు. ఆ సమయాన సబ్‌స్టేషన్‌లో ఉద్యోగం ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ ఇన్నాళ్లు పట్టించుకోకపోగా పలుమార్లు ఆందోళన చేసినా స్పందించడం లేదు. చివరకు శనివారం నరసింహారావు కుటుంబంతో సహా జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయానికి వెళ్లగా అధికారులు కలవలేదు. దీంతో ఆయన మాట్లాడుతూ వచ్చే గురువారం ఖమ్మం ఎస్ఈ కార్యాలయం పైనుంచి కుటుంబంతో దూకి ఆత్మహత్య చేసుకుంటానని వెల్లడించాడు. తనకు ఉన్న కొద్దిపాటి మిని సబ్‌స్టేషన్‌కు ఇచ్చి నిరాశ్రయులమయ్యామని, కుమార్తె చికిత్సకు డబ్బు లేక ఇబ్బంది పడుతున్నామని వాపోయాడు.

గ్రానైట్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటాపోటీ

అధ్యక్ష స్థానానికి బరిలో వేముల, పాటిబండ్ల


వేముల రవికుమార్


పాటిబండ్ల యుగంధర్

ఖమ్మంఅర్బన్: 'ది ఖమ్మం గ్రానైట్ శ్లాబ్, ప్యాక్టరీల ఓనర్స్ అసోసియేషన్' ఎన్నికలు ఈనెల 28న జరగనున్నాయి. అసోసియేషన్‌లో 444 మంది సభ్యులు ఉండగా కార్యవర్గాన్ని ఏకగ్రీవం చేసేందుకు పలువురు ప్రయత్నించారు. అయితే, శనివారం నామినేషన్ల ఉపసమరణ గడువు ముగిసినా ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఎన్నికలు అనివార్యం కానున్నాయి. అధ్యక్ష స్థానానికి వేముల రవికుమార్, పాటిబండ్ల యుగంధర్ పోటీలో ఉన్నారని ఎన్నికల అధికారి ఎస్.శ్రీనివాసరావు వెల్లడించారు. ఇక వైస్ ప్రెసిడెంట్–1గా కొనకంచి శ్యాంప్రసాద్, 2గా తమ్మినేని సాగర్, జాయింట్ సెక్రటరీ–2గా చావా రామూర్తి, ఈసీ–2, 3, 5గా ఎం.అనిల్‌కుమార్, బి.లాలప్రతాప్, బి.రాజగోపాల్‌రెడ్డి ఏకగ్రీవమైనట్లు తెలిపారు. కాగా, అధ్యక్ష స్థానానికి ఇద్దరు, కార్యదర్శి పదవి కోసం కమర్తపు గోపాలరావు, మంకెన శేఖర్, సంయుక్త కార్యదర్శిగా ఎస్‌డీ.ఖాజామెయినుద్దీన్, షేక్ రియాజ్, కోశాధికారిగా ఆకుల నాగేశ్వరరావు, ఎం.పరమేశ్వరరెడ్డి, ఈసీలుగా డి.స్వేధన్, కె.వెంకటేష్, చెరుకూరి పూర్ణచంద్రరావు, పి.రవికుమార్ పోటీలో ఉన్నారు. ఈ మేరకు ఖమ్మంలోని హరిత గార్డెన్‌లో ఈనెల 28న ఎన్నికలు నిర్వహించనున్నారు. కాగా, గతంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష పదవిని వేముల రవికుమార్ ఆశించగా మరోమారు అవకాశం ఇస్తామని హామీ ఇచ్చి బరిలో నుంచి తప్పించినట్లు చెబుతున్నారు. దీంతో రెండు దఫాలు తాను తప్పకున్నప్పటికీ ఈసారి అవకాశం ఇవ్వకపోవడంతో పోటీకి దిగినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వివిధ పదవులకు ఏకగ్రీవమైన వారిలో ఎక్కువ మంది తమ ప్యానెల్ నుంచే ఉన్నారని ఆయన వెల్లడించారు.

పారిశుద్ధ్య కార్మికుల బాహాబాహీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు బాహాబాహీకి దిగిన ఘటన రెండు రోజుల క్రితం చోటు చేసుకోగా శనివారం వెలుగులోకి వచ్చింది. స్వచ్ఛ ఆటోడ్రైవర్, జవాన్ మధ్య వాగ్వాదం జరగగా ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకు వెళ్లింది. ఈ వివాదాన్ని కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా శనివారం అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో వారిపై చర్యలకు ఉపక్రమించగా.. కార్మిక సంఘాల నాయకులు జోక్యం చేసుకుని మొదటి తప్పుగా మందలించాలని కోరారు. ఈమేరకు వారితో లేఖ రాయించుకున్నట్లు తెలిసింది. కాగా, గొడవ పడిన సమయాన ఒకరి చేతిలో కత్తి కూడా ఉందని, క్షణికావేశంలో ఏదైనా జరిగితే పరిస్థితి ఏమిటనే చర్చ మొదలవుతోంది. కాగా, ఇలాంటి వారికి కార్మిక సంఘాల నాయకులు వత్తాసు పలకడం, చర్యలు తీసుకోకుండా అధికారులు వదిలేయడంపై విమర్శలు వస్తున్నాయి.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కామేపల్లి: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన గంటా రామకృష్ణ(33) కొద్ది రోజులుగా మద్యానికి బానిసై ఏ పని చేయకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించగా శుక్రవారం కలుపు మందు తాగాడు. కాసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆయనకు భార్య శ్రావణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై రామకృష్ణ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా జూడో జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి జూడో జట్ల ఎంపిక పోటీలను సోమవారం నిర్వహించనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని జూడో అసోసియేషన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వి.నరేశ్‌కుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకల్లా హాజరుకావాలని సూచించారు. వివరాలకు 99512 74678 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కబ్జా చేసిన స్థలాలు ఖాళీ చేయాలి..

డీఎల్‌పీఓ సుధీర్

భద్రాచలంఅర్బన్: కబ్జా చేసిన స్థలాలను వెంటనే ఖాళీ చేయాలని డీఎల్‌పీఓ సుధీర్ సూచించారు. శనివారం ఆయన పట్టణంలోని ఫారెస్ట్ ఆఫీస్ వద్ద ఆక్రమణకు గురైన స్థలాలను గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించి, దుకాణాల నిర్వాహకులతో మాట్లాడారు. పంచాయతీ స్థలంలో అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో తాము తొలగించే ప్రక్రియ మొదలుపెడితే ఇబ్బంది పడతారని తెలిపారు.

తరలించే వరకూ ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో డంపింగ్ యార్డ్ సమస్య ఎటూ తేలడం లేదు. దానవాయిగూడెంలో డంపింగ్‌యార్డు కొనసాగుతుండగా పొగ, దుర్వాసన అవస్థ పడుతున్నామని స్థానికులు తరచూ ఆందోళనకు దిగుతున్నారు. శుక్రవారం కూడా చెత్త ట్రాక్టర్లను ధర్నా నిర్వహించిన విషయం విదితమే. అయితే, ఎలాంటి ప్రకటన రాకపోవడంతో శనివారం కూడా నిరసన తెలిపారు. డంపింగ్ యార్డు తరలింపు పోరాట కమిటీ పేరిట పలువురు సాయంత్రం రాపర్తినగర్ బైపాస్ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఉదయం కూడా బీసీ కాలనీలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపగా అధికారులు చెత్త వాహనాలను రామన్నపేట మీదుగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మార్గంలో డంపింగ్‌యార్డుకు తరలించే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడికి వెళ్లి ఆందోళన నిర్వహించారు. జనావాసాల మధ్య నుంచి యార్డును తొలగించే వరకు నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు.



ఆందోళనలో పాల్గొన్న స్థానికులు

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

విధుల్లో ఉండగానే కన్నుమూత


వి.లోకేష్ (ఫైల్)


లోకేష్ కుటుంబీకులతో మాట్లాడుతున్న సీఐ

కొణిజర్ల: విధి నిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన కొణిజర్లలో శనివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్‌ఐ గుగులోత్ సూరజ్ తెలిపిన వివరాలు... కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఈసం లోకేష్(45) హెడ్‌కానిస్టేబుల్‌గా నాలుగేళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధులకు వచ్చిన ఆయన శనివారం తెల్లవారుజామున మూత్రవిసర్జన కోసం స్టేషన్ వెనకాల మరుగుదొడ్డి వైపు వెళ్తూ కింద పడ్డాడు. సహచర ఉద్యోగులు గమనించి ఆయనను లోపలికి తీసుకొచ్చి పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. లోకేష్ స్వగ్రామం కొత్తగూడెం కాగా ఖమ్మంలో నివాసముంటున్నాడు. ఆయనకు భార్య, ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా, లోకేష్ మృతదేహం వద్ద వైరా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, సీఐ సాగర్‌నాయక్ నివాళులర్పించి పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల నిమిత్తం కొత్తగూడెం మృతదేహాన్ని తరలించారు. ఈక్రమంలో స్టేషన్ ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావు తదితరులు లోకేష్ మృతదేహం వద్ద నివాళుల అర్పించారు.